
సాక్షి
బాపట్ల
శుక్రవారం । 28 । ఫిబ్రవరి । 2025



స్వామివారికి విశేష అలంకరణ

పిడుగురాళ్ల: పట్టణంలోని నాగులగుడిలోని గంగా పార్వతి సమేత భవానీ శంకరస్వామికి గురువారం విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 530.60 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 4,364 క్యూసెక్కులు విడుదలవుతోంది.



స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

లక్ష్మీపురం: ఏసీ కళాశాలలోని స్ట్రాంగ్ రూముల్లో పోలింగ్ బాక్సులను భద్రపరిచే ప్రక్రియను రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, జేసీ ఏ భార్గవ్ తేజ పరిశీలించారు.

కూటమి నేతల బరితెగింపు

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగులో పచ్చనేతలు బరితెగించారు. అరాచకానికి తెర తీశారు. ఎక్కడికక్కడ దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఏకంగా దాడులకు తెగబడ్డారు. పలుచోట్ల రిగ్గింగు చేసుకున్నారు. దాదాపు అన్ని పోలింగు బూత్‌లలో దొంగ ఓట్లు వేసుకున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసు అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదు. చాలా చోట్ల పచ్చ నేతలకు సహకారం అందించారు. కొన్ని చోట్ల పీడీఎఫ్ ఏజెంట్లను బయటకు పంపారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగులో కూటమి నేతల అరాచకంపై విమర్శలు వెల్లువెత్తాయి.

- పీడీఎఫ్ పోలింగ్ ఏజెంట్లపై దాడులు
- బాపట్ల, భట్టిప్రోలుల్లో దౌర్జన్యం
- చుండూరులో పలుమార్లు యత్నం
- అన్నిచోట్ల యథేచ్ఛగా దొంగ ఓట్లు
- సహకరించిన పోలీసు అధికారులు
- జిల్లాలో 74.31 శాతం పోలింగ్
- విజయంపై పీడీఎఫ్ ధీమా



బాపట్ల మున్సిపల్ స్కూల్ పోలింగ్ బూత్ వద్ద రిగ్గింగ్‌ను అడ్డుకునేందుకు యత్నించిన పీడీఎఫ్ నాయకుడిపై టీడీపీ నేతల దౌర్జన్యం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్లలోని మున్సిపల్ పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఉదయం నుంచి కూటమి నేతలు తమ కార్యకర్తలను క్యూలైన్లలో నిల్చోబెట్టి యథేచ్ఛగా దొంగ ఓట్లు వేశారు. స్థానిక ఎమ్మెల్యే అనుచరులతో కలసి పలుమార్లు బూత్‌లోకి చొరబడి ఇష్టానుసారం దొంగ ఓట్లు వేయించారని పీడీఎఫ్ నేతలు ఆరోపించారు. బాపట్లకు చెందిన టీడీపీ మహిళా నేత ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఇక్కడ కూర్చొని దొంగ ఓట్లు వేయించారు. పీడీఎఫ్ నేతలు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పోలీసులు పట్టించుకోలేదు. ఇదే బూత్‌లో సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో టీడీపీ నేతలు రిగ్గింగుకు పాల్పడి మిగిలిన ఓట్లు వేసుకునేందుకు ప్రయత్నించారు. పోలీసులు ఉన్నా పాఠశాల గేట్లు తోసుకుని వెళ్లే ప్రయత్నం చేశారు. అక్కడే ఉన్న ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్ వారిని అడ్డుకొని పోలింగ్ సమయం ముగిశాక టీడీపీ వారిని లోపలికి ఎలా అనుమతిస్తారంటూ పోలీసు అధికారులను నిలదీశారు. దీంతో రెచ్చిపోయిన టీడీపీ నేతలు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు తదితరులు.. పీడీఎఫ్ నాయకుడు అనిల్‌కుమార్ పై దాడి చేశారు. పోలీసులు అక్కడే ఉన్నా పట్టించుకోలేదు.

భట్టిప్రోలులోనూ అదే తంతు..

భట్టిప్రోలులో పీడీఎఫ్ బూత్ ఏజెంట్ లింగం శ్రీనుపై టీడీపీ నాయకులు దాడి చేశారు. కూటమి అభ్యర్థి ఆలపాటికి దొంగ ఓట్లు వేసేందుకు వచ్చిన టీడీపీ కార్యకర్తలను లింగం శ్రీను నిలదీయడంతో ఆయనపై దాడికి పాల్పడ్డారు. తర్వాత దౌర్జన్యంగా ఓట్లు వేసుకున్నారు. చుండూరులో కూటమి నేతలు పలుమార్లు బూత్‌లోకి చొరబడ్డారు. పీడీఎఫ్ ఏజెంట్లను బయటకు లాగి రిగ్గింగు చేసేందుకు యత్నించారు. దీనిని పీడీఎఫ్ నేతలు అడ్డుకున్నారు. బాపట్ల, పిట్టలవానిపాలెం, అడవులదీవి, రేపల్లె, వేమూరు తదితర చోట్ల బూత్‌లలో పీడీఎఫ్ ఏజెంట్లను బయటకు పంపించేశారు. దొంగ ఓట్లు అడ్డగోలుగా వేసుకున్నారు. మరికొన్ని చోట్ల ఓటియ్యడానికి రాని వారి జాబితా చూసి పచ్చనేతలు తమ కార్యకర్తలతో దొంగ ఓట్లు వేయించారు.

పీడీఎఫ్‌లో గెలుపు ధీమా

ఈ ఎన్నికల్లో ఆది నుంచి పీడీఎఫ్ గెలుపు ధీమాతో ఉంది. టీడీపీ అభ్యర్థి ఆలపాటికి అన్నివర్గాల మద్దతు లేదు. పైగా కూటమి పార్టీలైన జనసేన, బీజేపీలోనే కాక సొంత పార్టీలో ఆయనపై నేతలు, కార్యకర్తల్లో వ్యతిరేకత ఉంది. పైగా అధికారంలోకి వచ్చాక కూటమి ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్న అసంతృప్తి ప్రజల్లో ఉంది. అటు ఉద్యోగులతోపాటు నిరుద్యోగుల్లోనూ వ్యతిరేకత కనిపించింది. ఇది పీడీఎఫ్ అభ్యర్థికి కలిసొచ్చింది. దీంతో పాటు పీడీఎస్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు అన్నివర్గాల్లో మంచి పేరుంది. మూడు సార్లు ఎమ్మెల్సీగా వ్యవహరించిన ఆయన అన్ని వర్గాల సమస్యలపై పోరాడారనే మంచి పేరు ఉంది. ఎన్నికల్లో కూటమి ఎన్ని అక్రమాలకు పాల్పడినా పీడీఎఫ్ మాత్రం గెలుపు తమదేనని భావిస్తోంది.



బాపట్లలో బారులు తీరిన ఓటర్లు

పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు

ఈ ఎన్నికల్లో జిల్లా పోలీసు యంత్రాంగం చాలాచోట్ల కూటమికి పూర్తి సహకారం అందించిందన్న విమర్శలు వెల్లువెత్తాయి. బాపట్ల, భట్టిప్రోలు, చుండూరు ప్రాంతాల్లో పచ్చ నేతలు అక్కడి పీడీఎఫ్ నేతలపై దాడులకు తెగబడినా పోలీసులు పట్టించుకోలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. పలుచోట్ల పోలింగ్ కేంద్రాల్లోకి పచ్చ నేతలు చొరబడి దొంగ ఓట్లు వేసుకున్నా పోలీసులు కనీసం ఆపలేదు. చాలా చోట్ల పీడీఎఫ్ ఏజెంట్లను బయటకు లాగినా పోలీసులు వారికి రక్షణ కల్పించడంలో విఫలమయ్యారన్న విమర్శలున్నాయి. పోలీసుల తీరును అన్ని వర్గాలు తప్పుబడుతున్నాయి.

74.31 శాతం పోలింగ్ నమోదు

పోలింగ్ శాతం సమయాలవారీగా..

మండలం	ఉ.10	మ.12	మ.2	సా.4
చుండూరు	9.50	28.37	50.55	72.87
అమర్తలూరు	9.91	19.95	49.44	79.92
వేమూరు	12.10	17.20	55.55	73.78
కొల్లూరు	8.50	17.16	40.07	72.45
భట్టిప్రోలు	9.80	18.50	47.28	75.45
చెరుకుపల్లి	10.30	21.00	54.09	75.47
నగరం	8.58	17.80	45.58	71.63
రేపల్లె	10.75	18.94	50.17	76.25
నిజాంపట్నం	8.82	16.33	43.96	78.19
పిట్టలవానిపాలెం	11.17	20.10	52.03	72.29
కర్లపాలెం	9.50	23.17	55.00	77.50
బాపట్ల	10.80	20.24	54.31	75.36
జిల్లావ్యాప్తంగా	9.77	29.29	51.60	74.31

బాపట్ల జిల్లాలోని బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లోని 12 మండలాల పరిధిలో సాయంత్రానికి 74.31 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 24,493 మంది ఓటర్లకుగాను 11,736 మంది పురుషులు, 6,464 మంది మహిళలు కలిపి 18,200 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

సజావుగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

బాపట్ల /రేపల్లె రూరల్: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం సజావుగా సాగాయి. మొత్తం 18,200 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. జిల్లాలోని 12 మండలాలలో 24,493 మంది ఓటర్లు ఉండగా, 18,200 పోలయ్యాయి. పోలింగ్ గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైందని కలెక్టర్ చెప్పారు. రేపల్లె పట్టణంలోని ప్రకాశం ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటైన కేంద్రంలో పోలింగ్ సరళిని పరిశీలించారు. కాసేపు సిబ్బందితో మాట్లాడారు. ఓటింగ్ సరళి నెమ్మదిగా జరుగుతోందని కలెక్టర్ దృష్టికి పలువురు తీసుకువచ్చారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సెక్టార్, రూట్ ఆఫీసర్లను ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో నేలపు రామలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు, సిబ్బంది ఉన్నారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ కూడా రేపల్లెలోని ఓ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు, పట్టణ సీఐ మల్లికార్జునరావు, సిబ్బంది ఉన్నారు.



రేపల్లెలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

న్యూస్‌రీల్

హుండీ కానుకలు లెక్కింపు



రేపల్లె రూరల్: మహా శివరాత్రిని పురస్కరించుకుని అరవపల్లి బాల కోటేశ్వరస్వామి ఆలయంలో మొదలైన వేడుకలు గురువారంతో ముగిశాయి. వేకువజామునే స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం హుండీ కానుకలను ఈవో దివి వెంకట అప్పలాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, సిబ్బంది లెక్కించారు. ఈ ఏడాది రూ.10,52,647 ఆదాయం సమకూరిందన్నారు. గత సంవత్సరం కంటే ఆదాయం రూ.27,046 పెరిగిందన్నారు. తిరునాళ్ల ప్రశాంతంగా సాగేలా సహకరించిన వివిధ శాఖల అధికారులకు ఈవో కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా ముక్తేశ్వరుడి తిరునాళ్ల



రేపల్లె రూరల్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలో దక్షిణ కాశీగా పేరొందిన మోర్తోట గ్రామంలో వేంచేసియున్న ముక్తేశ్వరస్వామి ఆలయంలో గురువారం తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి సుప్రభాత సేవ, పంచామృతాలతో అభిషేకాలు, బిల్వ దళాలతో ప్రత్యేకంగా పూజలు చేశారు. రాచూరి జమీందార్ రాజామాణిక్యారావు సిద్ధార్థ మార్కండేయ రావు బహదూర్ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు చావలి సురేష్‌శర్మ పర్యవేక్షణలో బుధవారం రాత్రి ముక్తేశ్వరస్వామి–పార్వతీదేవిల కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. కల్యాణ మహోత్సవాన్ని వీక్షించారు. ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

'క్వారీ' తిరునాళ్ల ఆదాయం రూ.16.37 లక్షలు



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానం తిరునాళ్ల ఆదాయం గత ఏడాది కన్నా ఈ ఏడాది గణనీయంగా పెరిగినట్లు దేవదాయశాఖాధికారులు తెలిపారు. దేవస్థానం వద్ద గురువారం దేవదాయశాఖాధికారులు హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమంను నిర్వహించారు. హుండీ కానుకల ద్వారా రూ.6,72,636, అభిషేకం, ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.6,76,195, వివిధ రకాల వేలం ద్వారా 2,88,800 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. దేవస్థానానికి మొత్తంగా రూ.16,37,631లు ఆదాయం సమకూరిందని దేవదాయశాఖాధికారి పోతుల రామకోటేశ్వరరావు తెలిపారు. గత ఏడాది రూ.14,00,692 ఆదాయం రాగా గత ఏడాది కన్నా ఈ దఫా రూ.2,36,939 అదనపు ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

నందివాహనంపై మల్లేశ్వరుడు



మంగళగిరి టౌన్: మంగళగిరిలోని గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలల్లో భాగంగా స్వామి కల్యాణ మహోత్సవం అనంతరం గురువారం ఉదయం స్వామివారు నందివాహనంపై భక్తులకు దర్శనభాగ్యం కల్గించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన ఈఓ జేవీ నారాయణ ఉత్సవ నిర్వహణను పర్యవేక్షించారు. గ్రామోత్సంలో గంగా భ్రమరాంబ సమేతుడైన మల్లేశ్వరుడు పురవీధుల్లో విహరించారు.

దళారీ పోటు.. రైతన్నకు చేటు

- కొనుగోళ్లలో గోతం, ఎగుమతి, దిగుమతులపై అదనపు భారం
- రైతుకు క్వింటాకు రూ.100 నష్టం
- జిల్లాలో 30-35 లక్షల కింటాళ్ల ధాన్యం దిగుబడులు
- ఈ లెక్కన రూ.3 కోట్ల నుంచి రూ. 3.5 కోట్ల వరకు రైతన్నలపై భారం
- కాటాల్లో బస్తాకు రెండు, మూడు కేజీలు తరుగు



కారంచేడు ప్రాంతంలో ధాన్యం నూర్పిళ్లు చేస్తున్న దృశ్యం

కారంచేడు: ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. గతంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి రూ. 3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి రైతన్నలను ఆదుకున్నారు. గతేడాది ధాన్యం కింటా రూ.2,200 వరకు ఉంటే ప్రస్తుతం రూ.1,550 కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం పేరుకే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. సవాలక్ష ఆంక్షలతో అక్కడ ధాన్యాన్ని విక్రయించలేని పరిస్థితులున్నాయని అన్నదాతలు వాపోతున్నారు. దిక్కులేని పరిస్థితుల్లో మిల్లర్లు, దళారులను ఆశ్రయిస్తున్నారు.

గోతాల్లో సైతం వారిదే రాజ్యం..

ధాన్యం వ్యాపారులు సైతం అన్నదాతలను అమాయకులను చేసి వారి శ్రమ దోచుకుంటున్నారు. అదేమని అడిగితే ఇది ఇంతే అని బెదిరించే ధోరణి కనిపిస్తోంది. జిల్లా ధాన్యాగారంగా పేరొందిన కారంచేడు ప్రాంతంలోని అన్నదాతలు ధాన్యం కొనుగోలు చేసే దళారుల చేతిలో నిత్యం ఏదో విధంగా మోసపోతున్నారు. ధాన్యం నిల్వలు చేసే గోతాలను కూడా దళారులు తమ చేతివాటంతో రైతులకు నష్టం చేస్తున్నారు. కాటాల్లో మోసం చేస్తున్న ఘటనలు పునరావృతం అవుతూనే ఉన్నాయి. పర్చూరు నియోజకవర్గంలోని కారంచేడు, పర్చూరు, ఇంకొల్లు, చినగంజాం, చీరాల నియోజకవర్గంలోని వేటపాలెం, చీరాల మండలాల్లో కొమ్మమూరు కాలువ పరిధిలో సుమారు లక్ష ఎకరాల్లో వరి సాగు చేశారు. కారంచేడు మండలంలో అత్యధికంగా 25 వేలకుపైగా ఎకరాల్లో సాగైంది. పంటలు బాగా పండే అవకాశాలున్నాయని ఆశించిన అన్నదాతలకు గత ఏడాది డిసెంబర్‌లో అకాల వర్షాలతో దిగుబడులు పూర్తిగా తగ్గాయి. ఎకరానికి కనీసం 35-40 బస్తాలు అంచనా వేసుకోగా..25-30 బస్తాలే వచ్చాయి.

కాటాల సమయంలోనూ..

ఇక కాటాల సమయంలో రైతుల కళ్లు కప్పి హడావుడి కాటాలు వేస్తారు. దీనిలో బస్తాకు రెండు, మూడు కేజీలు ఎక్కువగా ధాన్యం పడుతోంది. ఒక్కో ట్రాక్టర్ లోడుకు రెండు నుంచి మూడు బస్తాల ధాన్యం తేడాలు వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. కారంచేడుకు చెందిన ఒక రైతు ఈ విషయాన్ని గమనించి దళారీతో గొడవకు దిగాడు. దళారీ వెంటనే నష్టపరిహారం ఇచ్చి బయటకు విషయం రాకుండా జాగ్రత్తలు పడ్డాడని సమాచారం. పాలకులు, అధికారులు స్పందించి గిట్టుబాటు ధరలతో ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వమే చేపట్టి అన్నదాతలను ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

బస్తాకు 2-3 కేజీల తరుగు..

గత ఏడాది బస్తా (75 కేజీలు) ధర రూ.2000 నుంచి రూ.2200 వరకు రైతులు విక్రయించారు. ఇప్పుడు బస్తా కేవలం రూ.1,550 నుంచి రూ.1,650 వరకు మాత్రమే దళారులు కొనుగోలు చేస్తున్నారు. కాటాలోనూ బస్తాకు రెండు, మూడు కేజీలు తరుగు వస్తోంది. గతంలో గోతం సంచికి డబ్బు చెల్లించేవారు. కానీ ప్రస్తుతం ఆ భారాన్ని కూడా రైతుల మీదనే వేస్తున్నారు. గోతం సంచితో పాటు, ఎగుమతులు, దిగుమతులు సైతం అన్నదాతలపై మోపడంతో వారికి బస్తాకు అదనంగా మరో రూ. 100 వరకు నష్టపోవాల్సి వస్తోంది.



ధాన్యం తరలిస్తున్న దృశ్యం

మోసం చేస్తున్న దళారులు

ధాన్యం కొనుగోలు వ్యాపారులు అన్నదాతలను కొన్ని చోట్ల మోసం చేస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. దళారులను నమ్మి ధాన్యం అమ్మేందుకు వచ్చే వారిని మోసం చేస్తే ఎలా? ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను గిట్టుబాటు ధరలు లేక అవస్థలు పడుతుంటే, ఇక దళారులు కూడా తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. వీటిని అరికట్టాలి.

– డీ శ్రీనివాసరావు, రైతు, కారంచేడు

ప్రభుత్వం చర్యలు చేపట్టాలి

దళారులతో సంబంధం లేకుండా అన్నదాతలను ప్రభుత్వం ఆదుకొనేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వమే రైతుకు మంచి గిట్టుబాటు ధరలను ప్రకటించి మార్క్‌ఫెడ్ ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తే నష్టపోకుండా ఉంటారు. బస్తాకు కనీసం రూ 2,200 వరకు ధర ఇప్పించాలి. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెబుతున్నా సరైన రీతిలో ఆచరణ గగనమైంది.

– నీరుకట్టు రాంబాబు, రైతు, స్వర్ణ

మోసం చేస్తే చర్యలు తప్పవు

ధాన్యం కొనుగోళ్ల సమయంలో వ్యాపారులు, మిల్లర్లు తప్పకుండా ఎలక్ట్రానిక్ కాటాలు వినియోగించాలి. మాన్యువల్‌గా కచ్చితంగా తూకం వేయాలి. ఇటీవల స్వర్ణలో బస్తాకు ఒక కేజీ తేడాను గమనించాం. అప్పుడే ఆ కాటాను సీజ్ చేసి కేసు నమోదు చేశాం. కాటాల్లో తేడాలు ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– కే నాగేశ్వరరావు, తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్, చీరాల

కల్యాణ వైభోగమే..!

- అంగరంగ వైభవంగా శివపార్వతుల కల్యాణం



పెదకాకాని: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి వేదమంత్రాల సాక్షిగా శాస్త్రోక్తంగా అర్చకులు గజవాహనంపై ఎదుర్కోలోత్సవం జరిపించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్, అర్చకులు, భక్తుల సమక్షంలో సాంప్రదాయబద్ధంగా కల్యాణ క్రతువునకు ముందుగా తాంబూలాలు మార్చుకున్నారు. అనంతరం గురువారం తెల్లవారుజామున కనుల పండువగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామివారి కల్యాణం వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా ఆలయంలో జరిగే లింగోద్భవ కాలమున స్వామివారికి ఏకాదశ ద్రవ్యాలతో జరిగే అభిషేక పూజల్లో పాల్గొనేందుకు భక్తులు పోటీ పడ్డారు. ఆయా ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారి కళ్యాణం తిలకించి భక్తిపారవశ్యంతో తన్మయత్వం పొందారు.

ఘనంగా కాశీ విశ్వేశ్వరస్వామి తిరునాళ్ల

బాపట్ల టౌన్: మండలంలోని అప్పికట్ల గ్రామంలో వెంచేసియున్న గంగా అన్నపూర్ణ విశాలాక్షి సమేత శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో గురువారం రాత్రి తిరునాళ్ల అత్యంత వైభవంగా నిర్వహించారు. తాటివాసాలతో తయారుచేసిన రథం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సుమారు 20 వేల మంది వరకు భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. దేవాలయం నుంచి రథం అప్పికట్లకు చేరుకుని, తిరిగి దేవాలయానికి చేరుకోవటంతో భక్తులు రోడ్ల వెంట కిక్కిరిసిపోయారు. మహాశివరాత్రి సందర్భంగా బుధవారం అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాపట్ల పట్టణ, గ్రామీణ పరిధిలోని శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



భక్తులతో కిక్కిరిసిన కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం



ప్రత్యేక అలంకరణలో గంగా అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి

క్లుప్తంగా

ఎన్నికల కోడ్ ఉల్లంఘన



అమర్తలూరు (వేమూరు): గోవాడ శ్రీ బాల కోటేశ్వర స్వామి మహా శివరాత్రి తిరునాళ్లలో వివిధ పార్టీలు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించాయి. అమర్తలూరు మండలంలో ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండాలతో వస్తే కేసు నమోదు చేస్తామని రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరరావు ప్రకటించారు. కానీ బుధవారం రాత్రి జనసేన నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండాలతో ఊరేగింపు నిర్వహించారు. కోడ్ ఉల్లంఘించినా పోలీసులు ఎలాంటి చర్యలు తీసులేదని భక్తులు ఆరోపిస్తున్నారు.

రైతులకు సమస్యలు లేకుండా చూడండి

రీసర్వేలో జాయింట్ కలెక్టర్



బొల్లాపల్లి : జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే గురువారం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. పలు వివరాలను తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. రీసర్వే పనుల గురించి ఆరా తీశారు. మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న రీసర్వే పనుల్లో రెవెన్యూ శాఖ తరఫున ఎలాంటి సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులకు న్యాయం జరిగేలా చూడాలని తెలిపారు. తహసీల్దార్ ఏవీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాకాని ప్రభకు ప్రమాదం



నరసరావుపేట రూరల్: కాకాని విద్యుత్ ప్రభ ప్రమాదానికి గురైంది. కోటప్పకొండ తిరునాళ్ల నుంచి తిరుగు ప్రయాణంలో గురవాయపాలెం సమీపంలోని 10ఆర్ మేజర్ కాలువపై అదుపుతప్పి నేలకొరిగింది. హైటెన్షన్ వైర్లను దాటించే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. వెంట ఉన్న గ్రామస్తులు అప్రమత్తంగా ఉండటంతో పెనుప్రమాదం తప్పింది. మరో క్రేన్ సాయంతో ప్రభను కాలువనుంచి బైటికి తీసి సిద్ధం చేశారు. తర్వాత గ్రామానికి తరలించారు.

కనుల పండువగా తెప్పోత్సవం



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో గల గంగా అన్నపూర్ణా సమేత మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో తెప్పోత్సవం వేడుకలు గురువారం కనులపండువగా నిర్వహించారు. మహా శివరాత్రి వేడుకలను పురస్కరించుకొని ఆలయ అర్చకులు పమిడిమర్రు శ్రీనివాస రావు ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. చల్లగుండ్ల గ్రామానికి చెందిన మడకా వెంకటేశ్వర్లు, రామతులసి, పొట్లపీడు గ్రామానికి చెందిన చుండూరు శివశంకర శ్రీనివాసరావు, వెంకట్రావమ్మల ఆధ్వర్యంలో తెప్పోత్సవం జరిపించారు. ఆలయంలోని కోనేటిని రంగురంగుల పూలతో అలంకరించారు. హంస వాహనంపై ఉత్సవమూర్తులు కొలువుదీరాయి. భక్తుల శివనామస్మరణల నడుమ తెప్పోత్సవం సాగింది.

చుండూరులో తమ్ముళ్ల అరాచకం

- వైఎస్సార్‌సీపీ నేతపై దాడికి యత్నం
- ఏజెంట్లను భయభ్రాంతులకు గురిచేసిన వైనం
- నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అప్రమత్తతతో పోలింగ్ ప్రశాంతం

చుండూరు(వేమూరు): ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను ఏకపక్షంగా చేసుకునేందుకు ముందస్తు ప్రణాళికగా టీడీపీ నాయకులు చుండూరులో బూత్ ఏజెంట్లను భయభ్రాంతులకు గురిచేశారు. మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడిపై హత్యాయత్నానికి కూడా వెనుకాడలేదు. దీంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చొరవతో పోలింగ్ రోజున చుండూరుకు అదనపు ఎస్పీని పంపారు. అదనపు పోలీస్ బందోబస్తుతో పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.

వేమూరు నియోజకవర్గంలోని మండల కేంద్రం చుండూరులో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. బూత్‌లో ఏజెంట్లను నియమించేందుకు మండలంలోని వలివేరు గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ గాదె శివరామకృష్ణారెడ్డి బుధవారం సాయంత్రం పోలింగ్ బూత్‌ల వద్దకు వచ్చారు. పోలింగ్ కేంద్రం అధికారులతో మాట్లాడి ఏజెంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మొదటి పోలింగ్ బూత్‌లో ఏజెంట్‌ను ఏర్పాటు చేశారు. రెండో పోలింగ్ బూత్ ఏజెంట్ ఫారంలో చిన్న పొరపాటు జరగటంతో ఫారం కోసం ఏజెంట్‌ను బయటకు పంపారు. అదే గ్రామానికి చెందిన తెలుగు దేశం పార్టీ నాయకుడు బాలకోటిరెడ్డి పోలింగ్ బూత్ వద్దకు ముగ్గురు వ్యక్తులను పంపారు. వారిచ్చిన సమాచారంతో గాదె శివరామకృష్ణారెడ్డి పోలింగ్ బూత్‌లో ఉన్నారని తెలుసుకోవటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. శివరామకృష్ణారెడ్డి వచ్చిన బైకు దహనం చేయాలని బాలకోటిరెడ్డి ఆదేశించాడు. ఈ విషయం తెలిసిన ఏజెంటు వెంటనే అప్రమత్తమై, శివరామకృష్ణారెడ్డిని సమీపంలోని అంబేడ్కర్‌నగర్‌కు తీసుకెళ్లారు. బాలకోటి రెడ్డి, మరికొందరితో కలసి అంబేడ్కర్ నగర్ వెళ్లి అక్కడి ఏజెంట్లను భయభ్రాంతులకు గురి చేశారు. మాజీ జెడ్పీటీసీ గాదె శివ రామకృష్ణారెడ్డిపై దాడి చేసేందుకు ప్రయత్నం చేశారు. అంబేడ్కర్ నగర్ చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు వెంటనే ఈ విషయాన్ని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. పనిలో పనిగా సీపీఎం నాయకురాలు డి.రమాదేవికీ తెలియజేశారు. గాదె శివరామకృష్ణారెడ్డిపై దాడికి పాల్పడేందుకు టీడీపీ నాయకులు సిద్ధపడటం, ఏజెంట్లను భయభ్రాంతులకు గురి చేసిన విషయాన్ని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, నియోజక వర్గం సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు వెంటనే బాపట్ల జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు డి.రమాదేవి రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీంతో బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, చుండూరు గ్రామంలో పోలింగ్ బూత్ వద్ద ఎలాంటి అల్లర్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీకి ఆదేశాలు జారీ చేశారు. చుండూరు ఎస్ఐ ద్వారా ఆయన్ను వలివేరు గ్రామం పంపించారు. పోలింగ్ రోజైన గురువారం పోలింగ్ బూత్‌ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు అదనపు పోలీస్ బలగాలతోపాటు అదనపు జిల్లా ఎస్పీని చుండూరు పంపారు. పోలింగ్ జరుగుతున్నపుడు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ కూడా చుండూరు విచ్చేసి, పరిస్థితిని సమీక్షించారు. ఎలాంటి గొడవలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను ఆదేశించారు. చుండూరు పోలింగ్ బూత్ వద్ద డీఎస్పీ, సీఐ, ఎస్, కానిస్టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఫలితంగానే చుండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.

పొలాల్లో రహదారి నిర్మిస్తే అడ్డుకుంటాం

తేల్చి చెప్పిన దళిత రైతులు



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సింగారావు

జె.పంగులూరు: 'మా పొలాల్లో రోడ్డు వేస్తే ఊరుకోం. వేరేవారి స్వలాభం కోసం మా పొలాలను పోగొట్టుకోలేం. ఈ విషయంలో ఎంత దూరం అయినా వెళ్లటానికి సిద్ధంగా ఉన్నాం' అంటూ పంగులూరు తహసీల్దార్ పి.సింగారావుకు తూర్పు కొప్పెరపాడు దళిత రైతులు తేల్చి చెప్పారు. వారి భూముల కొలతలు శనివారం తీసుకుంటామని, దానికి సంబంధించి దళిత రైతులు హాజరు కావాలని తహసీల్దార్ రెండు రోజులు క్రితం నోటీసులు పంపారు. దీంతో రైతులు గురువారం ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. గతంలో దళితులు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకున్నందుకు సర్వే నెంబర్ 254లో 20 మందికి ఒక్కొక్కరికి సుమారు 30 నుంచి 40 సెంట్ల వరకు బంజరు భూమిని ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు. దళితులకు ఇచ్చిన ఏడు ఎకరాల 50 సెంట్ల భూమిలో నుంచి గత సంవత్సరం పంగులూరు గ్రామానికి చెందిన బాచిన రత్నకుమార్ అనే వ్యక్తి తన చేనుకి పెద్ద రోడ్డు వేసుకున్నాడని, విషయం తెలిసిన తాము వెంటనే అడ్డుకొని రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులకు చెప్పామని తెలిపారు. రెవెన్యూ అధికారులు వచ్చి పరిశీలించి ఆ భూమితో రత్న ప్రభాకర్‌కు ఎలాంటి సంబంధం లేదని తేల్చారన్నారు. అందులో రోడ్డు వేయడం సరి కాదని తెలిపారన్నారు. వెంటనే అతని ద్వారానే ఆ రోడ్డును పూడ్చి వేశారని చెప్పారు. కానీ ఏడాది తర్వాత రరోడ్డు వేయాలని అధికారులకు దరఖాస్తు చేసుకున్నాడని, దీనిపై తహసీల్దార్ తమకు నోటీసులు పంపించారని తెలిపారు. తమ అనుమతి లేకుండా తమ భూముల నుంచి రోడ్డు వేసే హక్కు ఎవరికీ లేదని, చట్టపరంగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని రైతులు తెలిపారు. తహసీల్దార్ మారిన ప్రతి సారి తమ భూముల నుంచి దారి వేయాలని రెవెన్యూ అధికారులు నోటీసులు పంపిస్తున్నారన్నారు. అనంతరం సదరు భూమి వివరాను వీర్వోలు నూతలపాటి సుధాకర్, గ్రామ సర్వేయర్ నాయపాము ఎలీషాకు వివరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సింగారావు మాట్లాడుతూ శనివారం భూమిని పరిశీలిస్తానని, రైతులకు అన్యాయం జరగనివ్వనని హామీ ఇచ్చారు. సీపీఎం నాయకుడు రాయిణి వినోద్ బాబు, వేమూరి సునందబాబు, పాలపర్తి రాంబా బు, పాలపర్తి అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే పీడీఎఫ్ వారిపై దాడులు



పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్న నాయకులు సీహెచ్ గంగయ్య తదితరులు

బాపట్ల: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి భయంతోనే పీడీఎఫ్ మద్దతుదారులపై టీడీపీ వారు దాడికి తెగబడ్డారని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య అన్నారు. గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా బాపట్ల పట్టణంలో మున్సిపల్ హైస్కూల్లో పోలింగ్ కేంద్రం వద్ద దొంగ ఓట్లను అడ్డుకునే ప్రయత్నం చేసినందుకు పీడీఎఫ్ కార్యకర్త ఎస్.అనిల్ కుమార్‌పై పట్టణ టీడీపీ అధ్యక్షుడు గొలపల శ్రీనివాస రావు దాడికి తెగబడ్డాడన్నారు. పట్టణ పోలీసుల సమక్షంలో ఈ దాడి జరిగిందని గంగయ్య ఆరోపించారు. స్టేషన్లో గొలపల శ్రీనివాసరావుపై ఫిర్యాదు చేశారు. అనంతరం పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద సీహెచ్ గంగయ్య మాట్లాడుతూ బాపట్ల మున్సిపల్ హైస్కూల్లో అనిల్ కుమార్‌పై పదేపదే దాడులకు ప్రయత్నం జరిగిందన్నారు. తామేం చేసినా చెల్లుతుందని టీడీపీ నాయకులు అహంకారంతో వ్యవహరిస్తే ప్రజలు అంతా గమనిస్తూనే ఉన్నారన్నారు. పెద్దల సభకు జరిగే ఎన్నికల్లో సైతం సాధారణ ఎన్నికల్లా దౌర్జన్యాలకు, డబ్బులు పంపిణీకి పూనుకొని అడ్డగోలుగా గెలవాలనే ఈ దాడులకు పూనుకున్నారన్నారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన వారిలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్, వసంతరావు, కొండయ్య, నాగేశ్వరరావు, అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో అక్రమాలను అడ్డుకునేందుకు ప్రయత్నించిన తనపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్. అనిల్‌కుమార్ తెలిపారు. గురువారం బాపట్ల పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్‌లో సాయంత్రం 4.15 గంటల సమయంలో పోలింగ్ సమయం ముగిసిన తర్వాత గొలపల శ్రీనుతోపాటు మరికొందరు లోనికి వెళ్లేందుకు ప్రయత్నించారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వారిని ఎలా లోపలికి అనుమతిస్తారని ఎస్ఐను ప్రశ్నించానని తెలిపారు. ఇంతలో 'నువ్వు ఎవడవిరా ఇక్కడ మాట్లాడటానికి' అంటూ తనపై ఒక్కసారిగా దాడికి దిగారన్నారు. గొలపల శ్రీనుతోపాటు మరికొంతమంది దాడి చేశారని తెలిపారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన వెంట ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు.

గుర్తుతెలియని యువకుడు మృతి



కాలువ వద్ద యువకుడి మృతదేహం

చీరాల: మున్సిపల్ కార్యాలయం ఎదుట గల కాలువ వద్ద గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని గురువారం రాత్రి గుర్తించారు. ప్రమాదవశాత్తు మరణించాడా.. లేక ఇతర కారణాలా అని తెలియాల్సి ఉంది. అయితే మృతుడికి సంబంధించిన ఎలాంటి వివరాలు లభించలేదు. పోలీసుల దర్యాప్తులో పూర్తి విషయాలు తెలియాల్సి ఉంది.

అడ్డంగా బుక్కయ్యాడు

- చోరీకి పాల్పడుతూ దొరికిన దొంగ
- రూ.5 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం

మార్టూరు: ఓ ఇంట్లో చోరీకి పాల్పడుతూ ఇంటి యజమానులకు అడ్డంగా దొరికిపోయిన దొంగ ఉదంతం గురువారం సాయంత్రం మార్టూరులో జరిగింది. బాధిత కుటుంబం వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక మద్ది సీతాదేవి కాలనీకి చెందిన దంపతులు పచ్చవ శరణ్య, వెంకటేశ్వర్లు గురువారం మధ్యాహ్నం పనిపై బయటకు వెళ్లారు. సాయంత్రం నాలుగు గంటల ప్రాంతాల్లో ఇంటికి వచ్చిన శరణ్య తమ ఇంట్లో ఎవరో ఉన్నట్లు గుర్తించి స్థానికులను అప్రమత్తం చేసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు ఇంటి తలుపులు తెరిచి చూడగా 50 సంవత్సరాల వయసు గల అపరిచిత వ్యక్తి ఇంటి లోపల కనిపించాడు. బీరువా లోపల ఉండాల్సిన సుమారు రూ.5 లక్షల విలువైన 70 గ్రాముల బంగారు ఆభరణాలు అతని చేతిలో ఉండగా పోలీసులు వాటిని స్వాధీనం చేసుకొని నిందితుడిని స్టేషన్‌కు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దొంగ ఓట్లు వేయించిన అధికారపక్షం

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి



కొల్లూరులో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి

కొల్లూరు: అధికార పక్షం తప్పొప్పులు తెలుసుకోవాలంటే తప్పనిసరిగా ప్రతిపక్షానికి స్వేచ్ఛ అవసరం అని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి అన్నారు. గురువారం కొల్లూరులో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు తరఫున ఎన్నికల ప్రక్రియను పరిశీలించేందుకు ఆమె వచ్చారు. టీడీపీ నాయకులు పోలింగ్ బూత్‌ల వద్ద వ్యవహరిస్తున్న తీరు చూసి మండిపడ్డారు. టీడీపీ నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, ఏజెంట్లను బెదిరించి కూర్చోకుండా చేయడం దారుణమైన విషయమని ఆవేదన వ్యక్తం చేశారు. కొల్లూరులో ఓ యువకుడు పీడీఎఫ్ అభ్యర్థికి ఏజెంట్‌గా ఉంటున్న విషయాన్ని తెలుసుకొని ఇసుక క్వారీలో పనిలేకుండా చేస్తామని బెదిరించారు. చుండూరు మండలంలో సైతం ఏజెంట్‌లుగా ఉన్న వారిని అడ్డుకోవడం హేయమైన చర్యగా అభివర్ణించారు. పలు మండలాలతోపాటు, కొల్లూరులో సైతం టీడీపీ నాయకులు గుంపులుగా పోలింగ్ కేంద్రాలకు చేరుకొని దొంగ ఓట్లు వేయించారన్నారు. పట్టభద్రులు, ఉద్యోగులపై సైతం టీడీపీ నాయకులు బెదిరింపులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికే కాదు, అధికార పక్షానికే నష్టమన్నారు. బెదిరింపులకు పాల్పడటంపై ఆమె ధ్వజమెత్తారు. పట్టభద్రులకు సరైన స్వేచ్ఛ ఇవ్వకుండా టీడీపీ నాయకులు బెదిరింపులకు దిగడం మంచి చర్య కాదన్నారు. ఆమె వెంట ప్రజాసంఘాల నాయకులు బి. సుబ్బారావు, బీఎల్‌కే ప్రసాద్ ఉన్నారు.

బూత్ ఏజెంట్‌పై టీడీపీ కార్యకర్త దాడి హేయం



సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు

భట్టిప్రోలు (కొల్లూరు) : ఎన్నికల ఏజెంట్‌పై దాడికి పాల్పడిన టీడీపీ కార్యకర్తపై చట్టపరంగా కఠినమైన చర్యలు చేపట్టాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం భట్టిప్రోలు టీఎం రావు హైస్కూల్‌లో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు తరఫున ఏజెంట్‌గా లింగం శ్రీను బూత్‌లో ఉన్నారు. అదే సమయంలో దొంగ ఓటు వేసేందుకు వెళ్లిన టీడీపీ కార్యకర్త కంభం సుధీర్‌ను చూసి శ్రీను అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో శ్రీనును సుధీర్ కింద పడేయడంతోపాటు అతని ఏజెంట్ గుర్తింపు కార్డును చించివేశాడు. భౌతిక దాడికి కూడా పాల్పడ్డాడు. దీంతో పోలింగ్ కేంద్రం వద్ద కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తెలుగు దేశం కార్యకర్తలు మధ్యాహ్నం నుంచి విచ్చలవిడిగా రిగ్గింగ్‌కు పాల్పడటంపై అనేక మార్లు పోలింగ్ అధికారి, విధుల్లో ఉన్న ఎస్ఐకు ఫిర్యాదు చేసినా సక్రమంగా స్పందించని ఫలితంగానే పీడీఎఫ్ ఏజెంట్‌పై దాడి జరిగిందని ప్రజాసంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వారిపై తక్షణం కేసు నమోదు చేసి కఠిన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి జి. సుధాకర్, ప్రజా సంఘాల నాయకులు సత్యనారాయణ, గొల్ల నాగరాజు, దీపాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైద్యం నిరాకరించిన ప్రభుత్వ డాక్టర్

ఆర్డీఓకు ఫిర్యాదు చేసిన బాధితులు



ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తున్న బాధితురాలి కుమార్తె, కుటుంబ సభ్యులు

చీరాల: తాను చెప్పిన చోట మందులు కొనలేదని ఓ ప్రభుత్వ డాక్టర్ వైద్యం చేయడానికి నిరాకరించారని, అతడిపై చర్యలు తీసుకోవాలని బాధితులు చీరాల ఆర్డీఓకు గురువారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బాధితురాలి కుమార్తె టి.మల్లేశ్వరి తెలిపిన వివరాల మేరకు.. మరియమ్మపేటకు చెందిన గుంజి వెంకాయమ్మ అనే వృద్ధురాలు ఆరోగ్యం విషమించడంతో ఈ నెల 19వ తేదీ రాత్రి చీరాల ఏరియా వైద్యశాలలో చేర్పించారు. ప్రభుత్వ వైద్యశాలలో పని చేస్తున్న ఓ డాక్టర్.. చీరాల మసీదు సెంటర్‌లోని ప్రాణహిత మల్టీస్పెషాలిటి, క్యాన్సర్ హాస్పిటల్‌లో మందులు తెచ్చుకోవాలని రిఫర్ (ఈ ఆస్పత్రులు సదరు డాక్టర్‌వి అని ఆరోపణలు ఉన్నాయి.) చేశారన్నారు. అయితే ఆ ఆస్పత్రుల్లో మందులకు బిల్లులు ఇవ్వాలని కోరగా దానికి వారు నిరాకరించడంతో తాము బయట మెడికల్ షాపులో తెచ్చి ఇచ్చామన్నారు. అందుకు డాక్టర్ కోపగించుకున్నారని ఆరోపించారు. తన తల్లి ఆరోగ్య పరిస్థితిని పట్టించుకోకుండా రిపోర్టు ఫైల్ విసిరేశారన్నారు. తన కుటుంబ సభ్యులను ప్రభుత్వ హాస్పిటల్ నుంచి బయటకు పంపించారని పేర్కొన్నారు. ఆయన చెప్పిన ఆస్పత్రుల్లోనే చేసిన పరీక్షల రిపోర్టులు ఇవ్వాలని కోరగా అడ్రస్ లేని ఆస్పత్రుల రిపోర్టులు ఇస్తున్నారన్నారు. మళ్లీ గట్టిగా ప్రశ్నిస్తే మిత్ర డయాగ్నోస్టిక్, డిజిటల్ ఎక్స్‌రేకి చెందిన రిపోర్టులు ఇచ్చారని తెలిపారు. సదరు డాక్టర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆర్డీఓకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

చిలకలూరిపేట టౌన్: మహా శివరాత్రి పర్వదినం జాగారం చేసి తిరిగి ఇంటి వచ్చే క్రమంలో రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన చిలకలూరిపేట మండలంలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేమూరు మండలం వరహాపురం గ్రామానికి చెందిన కొందరు పర్చూరు మండలంలోని అన్నంభొట్లవారిపాలెం గ్రామానికి ఇటీవల పొగాకు కోతలకు వచ్చారు. ఈ నేపథ్యంలో బుధవారం మహా శివరాత్రి నేపథ్యంలో కోటప్పకొండకు కొమరగిరి శ్రీకాంత్, చొటురి సురేంద్ర బాబులు బైక్‌పై బుధవారం రాత్రి వెళ్లారు. రాత్రంతా జాగారం చేసి తిరిగి వచ్చే క్రమంలో గురువారం తెల్లవారుజాము 4.30 సమయంలో పోతవరం బటర్‌ఫ్లై వెంచర్ సమీపంలో వీరు నడుపుతున్న బైక్ అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో ఇద్దరు రోడ్డుపై పడిపోయారు. బైక్‌పై వెనుక కూర్చున్న సురేంద్రబాబు(21)కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం నడుపుతున్న శ్రీకాంత్‌కు స్వల్పగాయాలయ్యాయి. మృతుడి సోదరుడు శివకృష్ణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొల్లూరులో విచ్చలవిడిగా దొంగ ఓట్లు

- నిరక్షరాస్యులకు సైతం ఓటుహక్కు
- పోలింగ్ కేంద్రంలో టీడీపీ నాయకులు
- పీడీఎఫ్ ఏజెంట్లు ఆందోళన

కొల్లూరు: పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటింగ్ ప్రక్రియలో అనర్హులైన వారు కూడా ఓటేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా కొల్లూరులో గురువారం జరిగిన పోలింగ్ ఆద్యంతం టీడీపీ నాయకులు అడ్డగోలుగా వ్యవహరించారు. పోలింగ్ కేంద్రాలలో తిష్ట వేసి తమకు అనుకూలంగా ఓట్లు వేశారు. ఉదయం ఎన్నికలు ప్రారంభమైన దగ్గర నుంచి గుంపులుగా సంచరించారు. పట్టభద్రులు కాని వారిని సైతం బూత్‌లలోకి తీసుకొచ్చి ఓట్లు వేయించడం గమనార్హం. పోలింగ్ ముగిసే గంట ముందు నుంచి అధిక సంఖ్యలో దొంగ ఓటర్లను బూత్‌కు తీసుకొచ్చారు. కొల్లూరు బాలికోన్నత పాఠశాలలోని 395, 396 బూత్‌లలోకి సైతం టీడీపీ నాయకులు పదే పదే ప్రవేశిస్తూ తమకు అనుకూలమైన ఓటర్లను ముందు పంపారు. బూత్ ముఖద్వారాల వద్దే మకాం వేసి ఓటర్లకు సూచనలు చేయడం వివాదాస్పందమైంది. కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు కేటాయించిన సంఖ్యను ఓటర్లకు చెబుతూ పోలింగ్ బూత్‌లలోనే ప్రచార పర్వానికి తెరతీశారు. దీనిపై పీడీఎఫ్ ఏజెంట్లు ఆందోళనకు దిగారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినందుకు టీడీపీ వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు వారిని తక్షణం బయటకు తరలించాలని అధికారులను డిమాండ్ చేశారు. అధికార యంత్రాంగం సైతం చూసీచూడనట్లు వ్యవహరించింది.

ఆరవ పటాలంలో శివరాత్రి వేడుకలు

మంగళగిరి: నగర పరిధిలోని 6వ బెటాలియన్‌లో గురువారం మహా శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కమాండెంట్ కె. నగేష్‌బాబు దంపతులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెటాలియన్ అధికారులు, సిబ్బంది అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకుని పూజలు జరిపారు. అనంతరం భక్తులకు కమాండెంట్ అన్నదానం చేశారు. కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ డి. ఆశీర్వాదం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముళ్ల పొదల్లో నవజాత శిశువు

- ఆసుపత్రికి తరలిస్తుండగా మృత్యువాత
- వినుకొండ రూరల్ మండలం నడిగడ్డలో ఘటన



నవజాత శిశువు

వినుకొండ: వినుకొండ రూరల్ మండలం నడిగడ్డ గ్రామంలో నవజాత శిశువును ముళ్లకంపలో పడేసిన దారుణ సంఘటన గురువారం ఉదయం జరిగింది. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగానే శిశువు ప్రాణాలు కోల్పోయింది. సేకరించిన వివరాల ప్రకారం... గ్రామంలోని రోడ్డు పక్కన ముళ్ల కంపలో శిశువు ఏడుపు వినిపిస్తుండటంతో స్థానికులు గమనించి 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారొచ్చి మగ శిశువుగా గుర్తించారు. శిశువును బతికుండగానే ముళ్ల పొదల్లో వదిలిపెట్టడం చూపరులను సైతం కలచివేసింది. కదలలేని స్థితిలో ఉన్న శిశువును ఓ వైపు చీమలు కుడుతుండగా.. ముళ్లు గుచ్చుకుంటూ రక్తం కారింది. తొలుత ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత స్పందించారు. ప్రథమ చికిత్స అనంతరం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలిస్తుండగా పేరేచర్ల వద్దకు వెళ్లగానే శిశువు మృతి చెందింది.

తిరునాళ్లలో దొంగల చేతివాటం

పెద్ద ఎత్తున సెల్‌ఫోన్‌లు, బైకులు చోరీ

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ తిరునాళ్లలో దొంగలు తమ చేతివాటం ప్రదర్శించారు. తిరునాళ్లకు వచ్చిన యాత్రికుల పర్సులు, సెల్‌ఫోన్‌లు అపహరించారు. ఈ మేరకు బాధితులు పలువురు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. నరసరావుపేటకు వచ్చేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కిన ప్రయాణికుడు టిక్కెట్టు తీసుకునేందుకు ప్రయత్నించగా అప్పటికే జేబులోని డబ్బును దొంగలు కాజేశారు. గత్యంతరం లేక బస్సులో నుంచి దిగిపోయాడు. తిరునాళ్లలో ప్రభలపై సాంస్కృతిక ప్రదర్శన చూసే సమయంలో, ప్రధాన రహదారుల్లో రద్దీగా ఉండే ప్రాంతాల్లో దొంగలు చేతికి పనిచెప్పారు. అలాగే ద్విచక్రవాహనాలు కూడా చోరీకి గురయ్యాయి. ఖాళీ ప్రదేశాల్లో ద్విచక్ర వాహనాలను నిలిపి తిరునాళ్లకు వెళ్లిన వారి వాహనాలను చోరీ చేశారు.

ప్రకృతి సాగుతో రైతులకు లాభం

పెదకూరపాడు: ప్రకృతి వ్యవసాయ విధానంలో మిరప పంట సాగు చేస్తూ అంతర పంటలు వేయటం వల్ల లబ్ధి కలుగుతుందని పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే అమలకుమారి రైతులకు సూచించారు. గురువారం పెదకూరపాడు మండలం లింగంగుంట గ్రామంలో రాష్ట్ర పరిశోధన బృందం మిరప పంట పొలాలను పరిశీలించింది. ప్రకృతి సాగు, ఆదాయం, ఖర్చుల వివరాలను సభ్యులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.అమలకుమారి మాట్లాడారు. మిరప వేసే ముందు 31 రకాల విత్తనాలను బీజామృతం విత్తన శుద్ధి చేసి పొలంలో చల్లి 45 రోజుల అనంతరం కలయ దున్నటం వలన ప్రయోజనం కలుగుతుందని రైతులు వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో సాగవుతున్న మిరప మొక్కలలో వ్యాధి నిరోధక శక్తి 20 నుంచి 23కు పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేయాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో పరిశోధన బృందం సభ్యులు హిమ బిందు, లీలావాణి సిబ్బంది పాల్గొన్నారు.

పాత జాతీయ రహదారిపై బైక్ ప్రమాదం

తాడేపల్లి రూరల్: మంగళగిరి నుంచి ప్రకాశం బ్యారేజ్‌కు వెళ్లే పాత జాతీయ రహదారిపై పాత పెట్రోల్ బంక్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థికి స్వల్ప గాయాలయ్యాయి. సేకరించిన వివరాల ప్రకారం .. మంగళగిరిలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలో చదువుతున్న విజయవాడకు చెందిన విద్యార్థి స్నేహితుడితో కలసి బ్యారేజ్ నుంచి ఉండవల్లి సెంటర్ మీదుగా ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. పాత జాతీయ రహదారిపై పోలకంపాడు లారీ స్టాండ్ వద్ద ఎదురుగా వస్తున్న అగ్నిమాపక వాహనాన్ని రాంగ్‌రూట్‌లో వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం ముందు టైర్ ఊడిపోయి నుజ్జునుజ్జయింది. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు విద్యార్థుల్లో ఒకరికి స్వల్ప గాయాలు కాగా, మరొకరు సురక్షితంగా బయటపడ్డాడు. స్వల్పంగా గాయపడిన విద్యార్థిని ప్రైవేటు వాహనంలో విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

భవనంపై నుంచి జారి పడిన కూలీలు

ఇద్దరికి తీవ్ర గాయాలు



క్షతగాత్రులు బాణావత్ రాంబాబు నాయక్, ఖాజావలి

సత్తెనపల్లి: బిల్డింగ్ పై నుంచి జారిపడి ఇద్దరు కూలీలకు తీవ్ర గాయాలైన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని నాగన్న కుంటలో గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి... పట్టణంలోని నాగన్న కుంటలో మున్సిపల్ ఉద్యోగి మొహిద్దీన్ ఇంటిపై వాటర్ ట్యాంకును ఏర్పాటు చేసేందుకు పట్టణంలోని బాణావత్ రాంబాబు నాయక్, ఖాజావలి అనే ఇద్దరు కూలీలను పని నిమిత్తం మాట్లాడుకున్నారు. వారు వాటర్ ట్యాంకు లాగేందుకు తాళ్లు కట్టగా, తాడు సరిపోకపోవడంతో అదనపు తాడు కట్టి పైకి లాగే క్రమంలో తాడు తెగిపోయింది. కార్మికులు ఒక్కసారిగా మూడు అంతస్తుల భవనం పై నుంచి జారిపడ్డారు. ఈ ఘటనలో బాణావత్ రాంబాబు నాయక్ నడుముకు తీవ్ర గాయాలు కాగా, ఖాజావలికి తలకు, తదితర చోట్ల గాయాలయ్యాయి. సంఘటన జరిగిన వెంటనే క్షతగాత్రులను పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించగా ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అవ్వారు ప్రసాదరావు ఇలాంటి కూలీలకు అండగా నిలిచేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. బాధితుల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.